సాక్షి
అనంతపురం
ఆదివారం । 7 । జూలై । 2024



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



టమాట కిలో రూ.37

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.37 పలికింది.

గరిష్టం/కనిష్టం
34.3°/24.4°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి నుంచి తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 12 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

జనం గుండెల్లో వైఎస్సార్

- ఈ నెల 8న మహానేత జయంతిని ఘనంగా నిర్వహిద్దాం
- వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా



అనంతపురం కార్పొరేషన్: తెలుగు రాష్ట్రాల ప్రజల గుండెల్లో ఇప్పటికీ మహానేత వైఎస్సార్ చిరస్థాయిగా ఉన్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య అన్నారు. ఆ మహానేత జయంతిని ఈ నెల 8న జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామ పంచాయతీ, నియోజకవర్గాల్లో డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించాలన్నారు. కేక్ కటింగ్‌లతో పాటు సేవా కార్యక్రమాలను చేపట్టి ఘన నివాళులర్పిద్దామన్నారు. ప్రతి ఒక్కరూ జయంత్యుత్సవంలో పాల్గొనాలని కోరారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్సార్ అమలు చేసిన సంక్షేమ విప్లవం లక్షలాది మంది జీవితాల్లో వెలుగు ప్రసాదించిందని ఆయన కొనియాడారు.

జయప్రదం చేయండి

అనంతపురం కార్పొరేషన్: దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి 75వ జయంతిని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. 8న ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించిన తర్వాత కేక్ కటింగ్ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అనంతరం జెడ్పీ కార్యాలయ ఆవరణలో ఉన్న మహానేత విగ్రహానికి నివాళులర్పిస్తామన్నారు. నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

రెండు గైనిక్ పీజీ సీట్ల మంజూరు



అనంతపురం మెడికల్: బోధనాస్పత్రిలోని గైనిక్ విభాగానికి మరో రెండు పీజీ సీట్లు మంజూరయ్యాయి. దీంతో గైనిక్‌లో పీజీ సీట్ల సంఖ్య 12కు చేరింది. ఈ మేరకు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సీట్ల మంజూరుపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ విద్యా సంవత్సరం నుంచే కొత్త సీట్లు భర్తీ చేస్తామన్నారు. భవిష్యత్తులో టీబీ అండ్ చెస్ట్ విభాగం, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలోని న్యూరో సర్జరీ విభాగానికి కూడా సీట్లు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆధునిక పద్ధతులతోనే చీనీలో లాభాలు



మర్తాడులో ఎండుతెగులు సోకిన చీనీ చెట్టును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

అనంతపురం అగ్రికల్చర్/గార్లదిన్నె: ఆధునిక సాంకేతిక పద్ధతులు, మేలైన యాజమాన్యం పాటించినప్పుడే చీనీ తోటల ద్వారా లాభాలు చేకూరుతాయని అఖిల భారతీయ వ్యవసాయ పరిశోధనా సంస్థ (ఐసీఏఆర్) శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ఆయా విషయాలపై అధికారులతో పాటు రైతులు, నర్సరీ నిర్వాహకులకు శిక్షణ అవసరమని తెలిపారు. 10 మంది శాస్త్రవేత్తలు శనివారం జిల్లాకు వచ్చారు. స్థానిక డ్వామా హాలులో హార్టికల్చర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా చీనీ తోటల సాగు, హెక్టారుకు సగటు దిగుబడి, వార్షిక దిగుబడులు, రైతుల పరిస్థితి, పంటకు ఆశిస్తున్న చీడపీడలు, తెగుళ్లు, వాటి నివారణకు అందిస్తున్న సిఫారసులు తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామంలో చీనీ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా బృందం ప్రతినిధి డాక్టర్ రాజేశ్వర్‌సింగ్ ఛండేల్ మాట్లాడుతూ అవగాహన లేకుండా అధిక మోతాదులో నీరు పెట్టడం, డ్రిప్పర్ వద్దనే ఒకే చోట ఎక్కువగా ఎరువులు వేయడం కారణంగా ఎండుతెగులు వస్తోందన్నారు. ప్రభుత్వ ధ్రువీకరణ ఉన్న నర్సరీల నుంచి మాత్రమే మొక్కలు తెచ్చుకోవాలన్నారు. రంగాపూర్ జాతి అంట్లతో మేలు కలుగుతుందన్నారు. నర్సరీల్లో వాడే మట్టి సోలరైజేషన్ చేయాలని, ఆర్గానిక్ మల్చింగ్ పాటించాలన్నారు. పొలుసు పురుగు నివారణకు మినరల్ ఆయిల్ వాడాలన్నారు. హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ సుబ్రహ్మణ్యం, ఉద్యాన శాఖ అధికారులు జి.ఫిరోజ్‌ఖాన్, జి.చంద్రశేఖర్, హెచ్‌ఓ రత్నకుమార్ తదితరులున్నారు.

అంతా మా ఇష్టం!



- నిబంధనలకు విరుద్ధంగా టీచర్ల సర్దుబాటు
- బ్రహ్మసముద్రం ఎంఈఓ-2 ఇష్టారాజ్యం
- జిల్లా విద్యాశాఖ అధికారుల అండతోనే తతంగం నడిపించారనే ఆరోపణలు



టీచర్లను సర్దుబాటు చేస్తూ బ్రహ్మసముద్రం ఎంఈఓ-2 జారీ చేసిన ఉత్తర్వులు

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖలో కొందరు అధికారులు బరి తెగిస్తున్నారు. వివాదాస్పద నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పిల్లలను ఇబ్బంది పెడుతున్నారు. వివరాలు.. ఏటా విద్యా సంవత్సరం ప్రారంభమై విద్యార్థుల అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన తర్వాత టీచర్లను సర్దుబాటు చేయడం పరిపాటి. అదికూడా విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాలతో మండల విద్యాశాఖ అధికారులు, డెప్యూటీ డీఈఓలు ఈ ప్రక్రియ చేపట్టాలి. అయితే, ఉన్నతాధికారుల నుంచి అలాంటి ఉత్తర్వులేవీ రాకుండానే బ్రహ్మసముద్రం ఎంఈఓ-2 ఏకంగా 8 మంది టీచర్లను సర్దుబాటు చేయడం వివాదాస్పదమైంది. ప్రక్రియకు సంబంధించి ఎలాంటి అధికారం లేని ఎంఈఓ-2 నిర్ణయం తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. అడ్మినిస్ట్రేషన్ పనులన్నీ ఎంఈఓ-1 మాత్రమే చూసుకోవాలి, విద్యాభివృద్ధి పథకాల నిర్వహణను ఎంఈఓ-2 చూసుకోవాలి. అయితే బ్రహ్మసముద్రం ఎంఈఓ-2 అడ్మినిస్ట్రేషన్ అంశాల్లో కల్పించుకుని ఏకంగా ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. ఈ తతంగం వెనుక భారీగా డబ్బులు చేతులు మారాయని తెలిసింది. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి అండతోనే అడ్డగోలుగా వ్యవహరించారని సమాచారం.

సర్దుబాటు ఇలా చేశారు..

ఎంపీపీఎస్ పోలేపల్లి నుంచి భైరవానితిప్పకు, ఎంపీపీఎస్ వేపులపర్తి నుంచి ఎంపీయూపీఎస్ నాగిరెడ్డిపల్లికి, ఎంపీపీఎస్ యానకల్లు నుంచి ఎంపీయూపీఎస్ కన్నేపల్లికి, ఎంపీపీఎస్ మామడూరు నుంచి ఎంపీపీఎస్ తిప్పయ్యదొడ్డికి, ఎంపీపీఎస్ నంజాపురం నుంచి ఎంపీపీఎస్ గోవిందదొడ్డికి, ఎంపీయూపీఎస్ నాగిరెడ్డిపల్లి నుంచి జిల్లా పరిషత్ పిల్లలపల్లికి, ఎంపీపీఎస్ వేపులపర్తి నుంచి ఎంపీయూపీఎస్ భైరసముద్రానికి, ఎంపీపీఎస్ రాయలప్పదొడ్డిలో పని చేస్తున్న ఎంటీఎస్ టీచరు ఇక్కడ మూడు రోజులు, ఎంపీపీఎస్ యానకల్లులో మూడు రోజులు పని చేసేలా ఉత్తర్వులు ఇచ్చారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలకు డెప్యూటీ డీఈఓలు మాత్రమే సర్దుబాటు చేయాలి. అయితే ఇక్కడ జెడ్పీహెచ్‌ఎస్‌కు కూడా ఓ టీచరును సర్దుబాటు చేసి ఘనత చాటుకున్నారు.

గతేడాది టెలీ కాన్ఫరెన్స్‌లో చెప్పారట!

గత సంవత్సరం జూలై 21న అప్పటి డీఈఓ టెలీ కాన్ఫరెన్స్‌లో ఇచ్చిన ఆదేశాల మేరకు టీచర్లను సర్దుబాటు చేసినట్లు ఎంఈఓ-2 ఉత్తర్వుల్లో పేర్కొనడం గమనార్హం. గతేడాది విద్యా సంవత్సరానికి సంబంధించి అప్పటి డీఈఓ ఆదేశాలిచ్చి ఉండవచ్చని, వాటి ఆధారంగా నేడు టీచర్లను సర్దుబాటు చేయడం ఆశ్చర్యం కలిగిస్తోందని పలువురు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఇబ్బంది అని చెప్పినా వినలేదు

మా స్కూల్‌లో ఉన్న ఒక్కగానొక్క బయాలజీ టీచరును పిల్లలపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు సర్దుబాటు చేశారు. మా స్కూల్‌లో పిల్లలకు ఇబ్బందిగా ఉంటుందని పదేపదే చెప్పా. నిదానంగా మరో టీచరును ఇక్కడకు వేస్తామని ఎంఈఓ తెలిపారు.

– భాస్కర్, హెచ్‌ఎం, నాగిరెడ్డిపల్లి యూపీఎస్

చర్యలు తీసుకుంటాం

జిల్లాలో ఎక్కడా కూడా టీచర్లను సర్దుబాటు చేసేందుకు ఎలాంటి ఉత్తర్వులూ ఇవ్వలేదు. కమిషనర్ నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాతనే ఈ ప్రక్రియ చేపడతాం. బ్రహ్మసముద్రం మండలంలో టీచర్లను సర్దుబాటు చేసిన విషయం నా దృష్టికి రాలేదు. అలా ఎలా చేస్తారు? విచారించి చర్యలు తీసుకుంటాం.

– బి.వరలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి

ఒక్కరోజే 540 సర్టిఫికెట్ల క్లియర్

- దరఖాస్తుదారుల సంతోషం

సాక్షి ఎఫెక్ట్..

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో 'తహసీల్దార్ డిజిటల్ కీ' ఇక్కట్లు తొలగాయి. శనివారం 'సాక్షి'లో 'సంతకాలకూ కిరికిరి' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఒక్కరోజే ఏకంగా 540 వివిధ సర్టిఫికెట్లను క్లియర్ చేశారు. దాదాపు నెల రోజులుగా పెండింగ్ ఉన్న వాటికీ మోక్షం కల్పించారు. ఉదయాన్నే తహసీల్దార్ బాలసుబ్రమణ్యం వీఆర్‌ఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. సర్టిఫికెట్లకు సంబంధించి వెరిఫికేషన్ వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచే దరఖాస్తుదారులకు మెసేజ్‌లు రావడం మొదలైంది. 20 రోజులు, నెల రోజుల క్రితం దరఖాస్తు చేసి రోజూ కార్యాలయం చుట్టూ తిరిగిన చాలామంది మెసేజ్‌లు రావడంతో ఊపిరి పీల్చుకున్నారు. వెంటనే సచివాలయాలు, మీసేవా కేంద్రాలకు వెళ్లి సర్టిఫికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ఇంటిగ్రేటెడ్, కుల, ఆదాయం, ఈడబ్ల్యూఎస్ తదితర ధ్రువీకరణ పత్రాల కోసం రోజూ వందలాది దరఖాస్తులు వస్తుంటాయి. రూరల్ మండలం ఏర్పాటు తర్వాత రూరల్ మండల తహసీల్దార్ డిజిటల్ కీ ప్రత్యేకంగా లేకపోయింది. అర్బన్ తహసీల్దార్‌కు చెందిన డిజిటల్ కీ పైనే ఆధారపడడంతో ఇబ్బందిగా ఉండేది. ఇటీవల ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆ డిజిటల్ కీ ఎట్టకేలకు వచ్చింది. ఇకపై సర్టిఫికెట్ల జారీలో ఆలస్యం ఉండదని, తమ లాగిన్‌కు వచ్చిన వెంటనే క్లియర్ చేస్తామని తహసీల్దార్ బాలసుబ్రమణ్యం చెప్పారు.

రుణాల మంజూరులో నిర్లక్ష్యమెందుకు?

- బ్యాంకర్లపై కలెక్టర్ వినోద్‌కుమార్ ఆగ్రహం



వార్షిక రుణ ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం సిటీ: రుణాల మంజూరులో నిర్లక్ష్యం ప్రదర్శించడం సరికాదని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయంలోని డీపీఆర్‌సీ భవన్‌లో శనివారం జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లా స్థాయి సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాల కోసం వచ్చే వారిని చిన్నచూపు చూడటం తగదన్నారు. ఆంక్షలతో ఇబ్బందులకు గురి చేయడం మంచిది కాదన్నారు. పదేపదే చెబుతున్నా పని తీరులో మార్పు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్ష్య సాధనలో వెనుకబడిపోవడం సిగ్గు చేటన్నారు. రుణాల కోసం వచ్చే పేదలను సిబిల్ స్కోర్ ఉందా అంటూ అడగడం ఏమిటని నిలదీశారు. పలుకుబడి ఉంటే రుణాల కోసం బ్యాంకులకు ఎందుకు వస్తారని ప్రశ్నించారు. బ్యాంకర్లు ఉదారంగా వ్యవహరించాలన్నారు. మహిళలు, చిరుద్యోగులు, రైతులు, దళితులకు విరివిగా రుణాలు ఇచ్చేందుకు చొరవ చూపాలని చెప్పారు. ఈ నెలాఖరులోగా 100 శాతం రుణ లక్ష్యం సాధించాల్సిందేనని తేల్చిచెప్పారు. స్టాండప్ ఇండియా కింద ప్రతి బ్యాంకు కనీసం ఇద్దరికైనా రుణాలు ఇవ్వాలన్నారు. సోషల్ మీడియా, ఇతర వేదికల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. అర్హులైన కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలన్నారు. విద్య, వ్యవసాయ సదుపాయాలు, స్వానిధి, ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్, పీఎంఈజీపీ, విశ్వకర్మ, హార్టికల్చర్ కింద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌ల కోసం విరివిగా రుణాలు ఇవ్వాలన్నారు. రూడ్‌సెట్ సంస్థ ద్వారా ఈ సంవత్సరం కనీసం 2 వేల మంది నిరుద్యోగులకు ఉపాధి, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు అనంతరం 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో రూ.18,992.35 కోట్ల వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం నర్సింగ్‌రావు, లీడ్ జిల్లా అధికారి గిరిధర్, నాబార్డు ఏజీఎం అనూరాధ, డీఆర్‌డీఏ పీడీ ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల ఇసుక దందా



నిదనవాడ వద్ద టీడీపీ నాయకులు అక్రమంగా డంప్ చేసిన ఇసుక


- గుట్టురట్టు చేసిన సెబ్ పోలీసులు

శింగనమల: అధికారమున్నదే దోచుకోవడానికి అన్నట్లుగా టీడీపీ నాయకులు వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి నెల కూడా గడవకముందే దోపిడీ పర్వం ప్రారంభించారు. సహజ వనరులపై కన్నేసి దందాకు తెరతీశారు. వాటాలు కుదరకపోవడంతో తమలోనే తాము కలహాలు పెంచుకుని, సోషల్ మీడియాకెక్కారు. ఈ క్రమంలో రంగంలోకి దిగిన సెబ్ పోలీసులు తెలుగుతమ్ముళ్ల అక్రమ ఇసుక గుట్టును రట్టు చేశారు. వివరాలు.. మండలంలోని నిదనవాడ వద్ద పెన్నానది సమీపంలో కొన్ని రోజులుగా టీడీపీ నాయకులు ఇసుకను పగలు డంప్ చేసి, రాత్రిళ్లు టిప్పర్ల ద్వారా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అయితే, టీడీపీలోనే ఉన్న కొందరు నాయకులు ఇసుక డంప్‌లు, జేసీబీల ఫొటోలను తీసి సోషల్ మీడియాలో షేర్ చేశారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయం వైరల్ కావడంతో బుక్కరాయసముద్రం సెబ్ పోలీసులు, తాడిపత్రి మైనింగ్ అధికారులు, శింగనమల రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగారు. పెన్నా నది సమీపంలో ఇసుక డంప్‌లను పరిశీలించారు. అక్కడే ఉన్న రెండు జేసీబీలను స్వాధీనం చేసుకుని, ఇద్దరు ఆపరేటర్లపై కేసులు నమోదు చేశారు. మొత్తం 160 టన్నుల ఇసుక ఉన్నట్లు లెక్కగట్టారు.

8 నుంచి ఉచిత ఇసుక విధానం

అనంతపురం అర్బన్: 'ఉచిత ఇసుక విధానం ఈనెల 8వ తేదీ నుంచి అమలులోకి రానుంది. టన్ను ఇసుక రూ.195తో పంపిణీ చేస్తారు. ఆ రోజు ఉదయం 6 గంటలకు కార్యక్రమం ప్రారంభించాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమైన ఏర్పాట్లు వేగంగా చేయండి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ శనివారం తన క్యాంపు కార్యాలయంలో జిల్లా ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయదుర్గం మండలం జుంజురాంపల్లి ఇసుక డిపోలో 58,160 టన్నులు, కణేకల్లు మండలం రచ్చుమర్రి వద్ద సీజ్ చేసిన ఇసుక 13,278 టన్నులు ఉందన్నారు. జుంజురాంపల్లి ఇసుక డిపోలో 8వ తేదీ ఉదయం 6 గంటలకు ఉచిత ఇసుక పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని చెప్పారు. కలెక్టర్, డీడీ మైన్స్‌తో ఒక జాయింట్ బ్యాంక్ అకౌంట్ తెరవాలని, అటు తరువాత క్యూఆర్ కోడ్‌ను డిపోల వద్ద ఏర్పాటు చేయాలన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పంపిన డబ్బులు జాయింట్ ఖాతాకు వెళతాయన్నారు. ప్రతి రోజూ ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే క్యూఆర్ కోడ్ పనిచేస్తుందన్నారు. రోజుకు ఒకరికి 20 టన్నుల ఇసుక అందిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డుతో పాటు మొబైల్ నంబర్, డెలివరీ చిరునామా తప్పని సరిగా అందించాలన్నారు. అంతకుముందు ఇసుక విధానం అమలుపై సీఎస్ నీరబ్‌కుమార్ విజయవాడలోని తన కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్పీ గౌతమిశాలి, కళ్యాణదుర్గం ఆర్‌డీఓ రాణి సుస్మిత, మైన్స్ డీడీ నాగయ్య, సెబ్ ఏఎస్పీ రామకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి గూగూడు ఉత్సవాలు



గూగూడులో కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి దేవాలయాలు

నార్పల: మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే గూగూడు కుళ్లాయిస్వామి ఉత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నాయి. నేడు స్వామి వారి ప్రథమ దర్శనం, 8- నిత్యపూజ నివేదన, 9- అగ్ని గుండం ఏర్పాటు, 10న స్వామి వారిని నిలుపుట, 11న నిత్యపూజ నివేదన, 12న ఐదవ సరిగెత్తు, 13న నిత్యపూజ నివేదన, 14న ఏడవ చిన్న సరిగెత్తు, రాత్రికి దేవుని మెరవణి, 15న నిత్యపూజ నివేదన, విడిదినం, 16న పెద్ద సరిగెత్తు, గ్రామోత్సవం, రాత్రికి దేవుని మెరవణి, అగ్ని గుండం ప్రవేశం, 17న అగ్ని గుండ ప్రవేశం, సాయంత్రం 4 గంటలకు జలధి కార్యక్రమం , 19న స్వామి వారి చివరి దర్శనం ఉంటాయి.

పేరు ఎలా వచ్చిందంటే..

గూగూడుకు ఆ పేరు ఎలా వచ్చిందనే విషయంపై పురాణ కథనం ప్రచారంలో ఉంది. ప్రస్తుతం కుళ్లాయిస్వామి ఉన్న చోట గుహుడు అనే మహర్షి ఓ ఆశ్రమం ఏర్పాటు చేసుకొని శ్రీరాముడి కోసం తపస్సు చేసుకునేవాడు. అరణ్యవాసంలో ఉన్న శ్రీరాముడు తన భార్యను వెదుకుతూ ఈ ప్రాంతానికి వచ్చాడు. గుహుడి ఆతిథ్యాన్ని స్వీకరించాడు. మరోసారి సీతాసమేతుడై దర్శనమిస్తానని శ్రీరాముడు ఆ పురుషోత్తముడికి తెలియజేస్తాడు. దీంతో ఆనందభరితుడైన గుహుడు అక్కడే తపస్సు చేస్తూ గడిపారు. రావణుడిని సంహరించిన తర్వాత శ్రీరాముడు అయోధ్యకు బయలుదేరుతాడు. అయోధ్యకు చేరే తొందర్లో గుహుడికు ఇచ్చిన మాటను మరిచి పోతాడు. చాలా కాలం వేచి చూసిన గుహుడికి శ్రీరాముడు తన ఆతిథ్యం స్వీకరించకుండానే అయోధ్య చేరిన విషయం తెలుస్తుంది. దీంతో తీవ్రంగా బాధపడిన గుహుడు ఆత్మాహుతికి సిద్ధపడతాడు. దూరదృష్టితో ఈ విషయాన్ని గమనించిన శ్రీరాముడు తన నమ్మిన బంటు అయిన ఆంజనేయుడిని గుహుడి వద్దకు పంపిస్తాడు. తాను త్వరలో సీతాలక్ష్మణ సమేతుడై దర్శనమిస్తానని సందేశం పంపుతాడు. దీంతో గుహుడు ఆత్మాహుతిని విరమించుకొంటాడు. కొన్ని రోజుల తర్వాత సీతారామలక్ష్మణులు గుహుడికి దర్శనమిచ్చి ఒక రోజు ఆతిథ్యాన్ని అందుకొన్నారని పురాణ కథనం. గుహుడు ఆత్మార్పణ చేసుకోవాలని నిర్ణయించుకున్న గుండమే నేడు ఆలయం ముందు ఉన్న గుండమని, తపస్సు చేసిన ఈ ప్రాంతమే కాలక్రమంలో గూగూడుగా మారిందని చెబుతారు.

కుళ్లాయిస్వామి చరిత్ర..

రెడ్డి కులానికి చెందిన భక్తుడికి ఒక రోజు కలలో టోపీ ధరించిన ఒక దైవ శక్తి కనపడి స్వామి వారి పీరు కనపడే చోటు గురించి చెప్పింది. ఈ విషయాన్ని ఆ వ్యక్తి గ్రామస్తులకు తెలపగా వారు వెళ్లి వెతకసాగారు. నిజంగానే ఆ వ్యక్తి చెప్పిన చోట పీరు దొరకడంతో ముస్లింలు ఆ పీరును కుహు అల్లా అని లేదా టోపీ వలి అని, హిందువులు కుళ్లాయి అని సంబోధించారు. కుళ్లాయిస్వామి పంజాను ఆంజనేయస్వామి దేవాలయం వద్దకు తీసుకువచ్చి గుడి ఏర్పాటు చేశారు. స్వామివార్లను దర్శించుకుంటే వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడేవారికి ఉపశమనం లభిస్తుందని, సంతానం లేనివారికి సంతాన భాగ్యం కలుగుతుందని భక్తులు బలంగా విశ్వసిస్తారు.

పెద్దమ్మకు పూజలు

జంట దేవాలయాల ముందు గ్రామ దేవత పెద్దమ్మ ఆలయం ఉంది. కుళ్లాయిస్వామి మొహర్రం ఉత్సవాల్లో భాగంగా మొదట హనుమాన్ చాలీసా పఠనం, అటుపై కుళ్లాయిస్వామికి చక్కెర చదివింపులు ఉంటాయి. ఆ తరువాత పెద్దమ్మకు పూజలు చేస్తారు.

వైఎస్సార్ జయంతి చేసుకోనివ్వరా?

- ఉరవకొండ నియోజకవర్గంలో దారుణ పరిస్థితులు
- వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులను ఇక సహించేది లేదు
- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి



మాట్లాడుతున్న మాజీ విశ్వేశ్వర రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: ఉరవకొండలో వైఎస్సార్ జయంతి నిర్వహించకుండా తమను అడ్డుకుంటుండడం దారుణమని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి ఉరవకొండ నియోజకవర్గంలో భయానక పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మంత్రి పయ్యావుల కేశవ్ సొంత పంచాయతీలో టీడీపీ నాయకులు పైశాచికంగా విద్యుత్ వైర్లు కోసేయడంతో 15 మంది రైతుల పొలాలకు కరెంటు సరఫరా ఆగిపోయిందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు అల్లాబకాష్‌కు చెందిన రూ.30 వేలు విలువ చేసే పైపులను ధ్వంసం చేశారన్నారు. వై రాంపురం గ్రామంలో లింగాయత్ కుటుంబానికి చెందిన ఓ వ్యక్తితో బలవంతంగా ఖాళీ పేపర్లపై సంతకాలు తీసుకున్నారన్నారు. ఉరవకొండ వైస్ ప్రెసిడెంట్ వన్నప్ప ఇంటిపై మూడుసార్లు దాడి జరిగిందన్నారు. కో ఆప్షన్ మెంబర్ సలీం ఇంటిపై రాళ్లు రువ్వారన్నారు. సింగిల్ విండో ప్రెసిడెంట్ షెక్షావలి కుమారుడిపై దాడులు చేస్తామని బెదిరించారన్నారు. ఓ స్టోర్ డీలర్‌ను చితకబాదారని తెలిపారు. కూడేరు మండలం ఉదిరిపికొండ తాండా ఎంపీటీసీతో పాటు వైఎస్సార్ సీపీ శ్రేణులపై దౌర్జన్యాలకు పాల్పడ్డారన్నారు. తమ పార్టీ శ్రేణులు, వారి ఇళ్లపై టీడీపీ కార్యకర్తలు, నాయకులు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారని విమర్శించారు. డాక్టర్ వైఎస్సార్ జయంతి ఏర్పాట్లతో పాటు భయాందోళనలో ఉన్న వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో ధైర్యాన్ని నింపేందుకు వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ ప్రణయ్‌రెడ్డి ఉరవకొండ వెళ్లేందుకు సంసిద్ధమైతే పోలీసులు అడ్డుకున్నారన్నారు. పోలీసులు ముందస్తు చర్యలు తీసుకొని ఉంటే దారుణ పరిస్థితులు తలెత్తేవి కావన్నారు. పోలీసుల అసమర్థత కారణంగానే వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు జరిగాయన్నారు. టీడీపీ నాయకుల దౌర్జన్యాలు, పోలీసుల నిర్లక్ష్య వైఖరిపై ఎస్పీ గౌతమిశాలి దృష్టికి తీసుకెళ్లాక పరిస్థితి కొంత అదుపులోకి వచ్చిందన్నారు. అరాచకాలను నిరసిస్తూ ఈ నెల 4న ధర్నా చేయాలని నిర్ణయించామని, అయితే, ఎస్పీ సూచన మేరకు కాస్త సమయం తీసుకున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం పోలీసులు ఎస్కార్ట్ వాహనం పంపి, సమావేశానికి వెళ్లేందుకు అనుమతిచ్చారని చెప్పారు. నూతన ప్రభుత్వానికి ఐదారు నెలల సమయం ఇద్దామనుకున్నామని, అరాచకాలను కొనసాగిస్తే మాత్రం చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జ్ ప్రణయ్ రెడ్డి, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వీరన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా 'వంకదారి'



వంకదారి మద్దిలేటి (రాజా)

తాడిపత్రి అర్బన్: ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ (వామ్) అధ్యక్షునిగా తాడిపత్రికి చెందిన వంకదారి మద్దిలేటి (రాజా)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా తలుపుల సురేంద్రనాథ్, కార్యదర్శిగా జయవరం రామచంద్రయ్య, కోశాధికారిగా కుప్పం రత్నమయ్యతో పాటు 35 మంది సభ్యులతో కూడిన కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులు ఆదివారం పట్టణంలోని మెయిన్ బజార్‌లోని ఆర్.వి.స్వామి కల్యాణమండపంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.

ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

తాడిపత్రి రూరల్: పెన్నానది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను శనివారం స్వాధీనం చేసుకున్నామని రూరల్ అప్‌గ్రేడ్ స్టేషన్ సీఐ లక్ష్మీకాంతరెడ్డి తెలిపారు. అలాగే సెబ్ అధికారులు దాడులు చేసి, రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని తమకు అప్పగించారన్నారు. డ్రైవర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

నేటి నుంచి పశుగ్రాస వారోత్సవాలు

అనంతపురం అగ్రికల్చర్: పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి రైతు సేవా కేంద్రంలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించనున్నట్లు శాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం శనివారం తెలిపారు. పశుసంపద, జీవ సంపద పరిరక్షణలో పశుగ్రాసం ప్రాధాన్యత గురించి అవగాహన కల్పిస్తామన్నారు. ప్రతి రైతూ కొంతైనా పశుగ్రాసం పెంచుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పచ్చిగడ్డి, ఎండు గడ్డి వాడే విధానం తెలియజేస్తామన్నారు. గడ్డి జాతుల మొక్కల రకాలు, అందులో ఉండే పోషకాలు, వాటి వల్ల పశువులకు ఒనగూరే ప్రయోజనాలు, పశుపోషణ, పాడి పెంపకం తదితర అంశాల గురించి రైతులకు అవగాహన కల్పిస్తామని తెలిపారు.

నాడు జైలు .. నేడు స్కూలు

- చెక్కు చెదరని 'అనంత' చరిత్ర అవశేషాలు
- ఒకనాడు కలెక్టర్ కార్యాలయంగానూ నం.1 స్కూల్



జైలు గదికి వేసే గడి



ఒకప్పటి జైలు ప్రధాన గదిలో నిర్వహిస్తున్న తరగతి



జైలు గదిలో నిర్వహిస్తున్న తరగతి గది

అనంతపురం కల్చరల్: భరతమాత స్వేచ్ఛాప తాకాన్ని రెపరెపలాడించడంలో భాగంగా నాడు సాగిన స్వాతంత్రోద్యమంలో ఉమ్మడి 'అనంత' వాసులు ఎందరో కీలకంగా పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో తమను ఎదురించిన వారిని కర్కశంగా బ్రిటీష్ వారు అణచి వేస్తూ వచ్చారు. ఇందులో భాగంగానే అనంతపురంలో చెరశాలను ఏర్పాటు చేసి, లెక్కకు మించి స్వాతంత్ర్య సమరయోధులను అందులో కుక్కి హింసించారు. నాడు వారిని బంధించిన జైలు నేడు చదువుల తల్లిగా మారిందన్న విషయం నేటి తరానికి తెలియదు. కానీ, ఇది అక్షర సత్యమనడానికి జిల్లా కేంద్రంలోని నం.1 స్కూలులో నేటికీ అందరినీ ఆశ్చర్యపరుస్తూ అలనాటి ఎన్నో దృష్టాంతాలు సజీవంగా కనిపిస్తున్నాయి. చరిత్రకు సాక్షీభూతమైన అద్భుత కట్టడం నేటికీ చెక్కుచెదరలేదు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను కళ్లకు కట్టేలా చూపే ఈ జైలును చూడాలనుకుంటే అనంతపురంలోని పాతూరులో ఉన్న నం.1 పాఠశాలను సందర్శించాల్సిందే.

తొలి కలెక్టర్ కార్యాలయంగానూ...

రెండు శతాబ్దాల క్రితం బళ్లారి జిల్లాలో అనంతపురం అంతర్భాగంగా ఉండేది. ఆ సమయంలో పాలనాపరమైన వ్యవహారాలు చూసేందుకు పాతూరులో ఓ కట్టడాన్ని నిర్మించారు. అనంతరం 1882లో అనంతపురం జిల్లాగా ఏర్పడిన తర్వాత తొలి కలెక్టర్ కార్యాలయాన్ని అప్పటి జైలు (నేటి నం.1 పాఠశాల)లోనే ఏర్పాటు చేశారు. అంతే కాక కొన్నేళ్ల పాటూ ఇక్కడే ప్రభుత్వ ఖజానా కూడా ఉన్నట్లుగా ప్రభుత్వ రికార్డులూ స్పష్టం చేస్తున్నాయి. కలెక్టర్ కార్యాలయం నిర్వహించినా... జైలు రూపురేఖలు ఏ మాత్రం చెక్కుచెదరకుండా అప్పటి అధికారులు కాపాడడం గమనార్హం. ఈ భవనం వెనకల శిక్షలు విధించేవారని, ఆఖరకు న్యాయస్థానం ఆదేశాల మేరకు ఉరి శిక్ష కూడా అమలు చేసేవారని ఇక్కడి ఆనవాళ్లను బట్టి తెలుస్తోంది. అయితే ఇటీవల ఆ ఆనవాళ్లు మరమ్మతుల్లో భాగంగా కనుమరుగవుతుండడం బాధాకరం.

సత్రం బడి నం.1గా మారింది :

స్వాతంత్రోద్యమ కాలంలో బాలికా విద్య కోసం ఉద్యమించిన దుర్గాబాయి దేశ్‌ముఖ్ పోరాట ఫలితంగా ఇదే కట్టడాన్ని కొన్నేళ్ల పాటు బాలికల హాస్టల్‌గా నడిపించారు. కాలక్రమంలో పాతూరులో ఉన్న సత్రం బడి ఇక్కడకు మార్చడంతో రాజేంద్ర మునిసిపల్ హైస్కూలు గాను, అదే పేరుతో మరో చోట నూతన భవనం నిర్మించడంతో నంబర్ 1 స్కూలుగా స్థిరపడిపోయింది. ఆసక్తిగా చూడాలే కాని ఒకప్పటి చెరశాలగా ఉన్న నేటి పాఠశాలలో దత్తమండలాల కలెక్టర్‌గా పనిచేసిన సర్ థామస్ మన్రో శిలాఫలకం, కారాగారపు బలమైన ఊచలు, ఖజానాగా ఉన్నప్పటి భద్రమైన రాతి గోడలు వంటి ఎన్నో ఆనవాళ్లు కనిపిస్తాయి. స్వాతంత్ర్య సమరయోధుల స్మారకంగా ఈ కట్టడాన్ని వారసత్వ సంపదగా గుర్తించాలని నగర వాసులు కోరుతున్నారు.

అనంత చరిత్రకు సజీవ దర్పణం



ఎంతో ఘనమైన చరిత్ర అనంత సొంతం. ఇక్కడ రాజుల కాలం నుంచి బ్రిటీష్ వారు పాలించే వరకూ ఎన్నో అద్భుత కట్టడాలు నేటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి. వాటిని సంరక్షించుకోవడంలో, వాటి ప్రాముఖ్యతను వ్యాప్తి చేయడంలో అలసత్వం కనిపిస్తోంది. నేను 2005 నుంచి 2017 వరకు ఈ పాఠశాలలోనే పనిచేశాను. నా ఉద్యోగ విరమణ కూడా ఇక్కడే సాగింది. అధికారులనుకుంటే చరిత్ర వారసత్వ సంపదగా గుర్తించి ప్రదర్శనశాలగా మార్చవచ్చు.

– చింతా వెంకటేశ్వర్లు, విశ్రాంత ఉపాధ్యాయుడు, అనంతపురం

వారసత్వ సంపదగా గుర్తించాలి



మూడు దశాబ్దాల క్రితం నేనూ నం.1 స్కూల్లోనే చదువుకున్నా. బాగా క్లోజ్‌గా ఉండే పదిమంది స్నేహితులు ఈనాటికీ ఇక్కడే కలుస్తుంటాం. మా అందరికీ ఈ స్కూల్ అంటే ఏదో తెలియని అభిమానం. ఇక్కడి వాతావరణం, చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచిన జైలు గదులు తలచుకుంటే ఎంతో ఆనందంగా ఉంటుంది. మేమందరం సరస్వతీ మాత విగ్రహాన్ని స్థాపించుకున్నాం. అపురూపమైన ఈ కట్టడాన్ని వారసత్వ సంపద చిహ్నంగా మారిస్తే బాగుంటుందని పలు మార్లు అధికారులకు విన్నవించుకున్నాం.

– ఉమేష్, పూర్వ విద్యార్థి, అనంతపురం

చరిత్రను కాపాడుకుంటున్నాం



చరిత్రను కళ్లకు కట్టేలా ఉన్న చారిత్రక పాఠశాలలో ప్రస్తుతం హెడ్మాస్టర్‌గా పనిచేస్తుండడం ఎంతో ఆనందంగా ఉంది. ఎన్నో ఏళ్ల ఘనచరిత్రను నేటికీ కాపాడుకుంటున్నాం. విద్యార్థులు పొరపాటున కూడా కట్టడాలను పాడు చేయకుండా దాని ప్రాముఖ్యతపై చైతన్య పరుస్తున్నాం. నేను ఇక్కడకు రాకముందు కొన్ని మరమ్మతులు జరిగాయి. పాత వాటి స్థానంలో కొత్త నిర్మాణాలు వచ్చాయి.

– మహమ్మద్ గౌస్, హెడ్మాస్టర్, నం.1 స్కూల్, అనంతపురం

చింతలరాయుని సేవలో పరిశ్రమలు, వాణిజ్య డైరెక్టర్



ఆలయ ప్రాశస్త్యం గురించి వివరిస్తున్న అర్చకులు

తాడిపత్రి అర్బన్: పరిశ్రమలు, వాణిజ్య శాఖ డైరెక్టర్ అరులానందన్ శనివారం తాడిపత్రిలోని ప్రాచీన చింతల వెంకటరమణస్వామి ఆలయాన్ని దర్శించారు. మూలవిరాట్‌ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆనందవల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈసందర్భంగా అర్చకులు స్వామి వారి శేషవస్త్రాలతో డైరెక్టర్‌ను సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టత గురించి తెలుసుకున్నారు. ఆలయంలోని శిల్పకళా సౌందర్యానికి ముగ్ధులయ్యారు.

సాయి మార్గం ఆచరణీయం



నృత్య రూపకంలోని ఘట్టం

ప్రశాంతి నిలయం: సత్యసాయి చూపిన మార్గం మానవాళికి సదా ఆచరణీయం. ఇదే సందేశంతో నిర్వహించిన సంగీత నృత్యరూపకం భక్తులను మైమరపించింది. పర్తియాత్రలో భాగంగా ప్రశాంతి నిలయానికి విచ్చేసిన సంగారెడ్డి జిల్లా సత్యసాయి భక్తులు సత్యసాయి సన్నిధిలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాకు చెందిన బాలవికాస్ చిన్నారులు 'మైనస్ 4 ప్లస్ 2' పేరుతో నృత్యరూపకం నిర్వహించారు. అబద్ధాలు ఆడటం, ఇతరుల చెడు కోరుకోకుండా ఉండటం, చెడు ప్రచారాలు చేయడం, అనవసర మాటలు మాట్లాడటం వంటి 4 చెడు గుణాలు వదిలి, భగవంతుని స్మరణ, ధర్మాన్ని పాటించడం వంటి రెండు గుణాలు అలవర్చుకోవాలన్న సందేశంతో నృత్య రూపకం సాగింది.

హత్య కేసులో ముగ్గురి అరెస్ట్



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

గుంతకల్లు రూరల్: హత్య కేసులో నిందితులైన ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం గుంతకల్లు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్‌ఐ సురేష్ మీడియాకు వెల్లడించారు. నల్లదాసరిపల్లికి చెందిన లక్ష్మన్న (50) తన రెండవ కూతురు లలితను దౌల్తాపురం గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌కు ఇచ్చి వివాహం చేశారు. కొద్ది రోజులకే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు తలెత్తాయి. తరచూ గొడవలు జరుగుతుండడంతో లక్ష్మన్న తన కూతురును పుట్టింటికి తీసుకొచ్చేశాడు. తర్వాత పెద్ద మనుషుల పంచాయితీ జరిగింది. ఆ సమయంలో లక్ష్మన్న తన అల్లుడిని చెప్పుతో కొట్టడమే కాకుండా అతడి తండ్రిని చొక్కా పట్టుకుని అవమానించాడు. తాను రౌడీషీటర్ అని, మెట్టినింటిలోని మగాళ్లందరినీ చంపి తన కూతురు పేరిట మొత్తం ఆస్తి రాయిస్తానని బెదిరించాడు. ఈ ఘటనతో చంద్రశేఖర్ తన మామపై రగిలిపోయాడు. అన్న రాజశేఖర్‌తో పాటు స్నేహితుడు సతీష్ సహాయంతో లక్ష్మన్న హత్యకు పథకం రచించాడు. ఈ నెల నాలుగో తేదీ రాత్రి గుంతకల్లు నుంచి నల్లదాసరపల్లికి వెళ్తున్న లక్ష్మన్నను కాపుకాసి హత్య చేశారు. కుటుంబ సభ్యులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు ఫోన్ లొకేషన్‌ను గుర్తించి ఘటనా స్థలానికి చేరుకున్నారు. లక్ష్మన్న హత్యకు గురైనట్లుగా తెలియడంతో క్లూస్ టీం, స్నిఫ్ఫర్ డాగ్‌ను పిలిపించి 24 గంటల్లోనే నిందితులను గుర్తించి.. నక్కనదొడ్డి రైల్వేస్టేషన్ వద్ద అరెస్ట్ చేశారు. హత్యకు ఉపయోగించిన రెండు ద్విచక్ర వాహనాలు, రెండు కొడవళ్లను స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ తెలిపారు.

అలసిపోయి.. తిరిగిరాని లోకాలకు

- నిద్రలోనే తుదిశ్వాస విడిచిన రైతు



తిప్పేస్వామి (ఫైల్)

బెళుగుప్ప: వ్యవసాయ పనులు చేసి అలసిపోయి ఇంటికి వచ్చి కునుకు తీసిన రైతు నిద్రలోనే తుది శ్వాస విడిచాడు. కుటుంబ పెద్ద ఆకస్మిక మృతితో భార్య, పిల్లలు గుండెలవిసేలా రోదించారు. వివరాలిలా ఉన్నాయి. నక్కలపల్లికి చెందిన వడ్డే తిప్పేస్వామి (44) ఎంఏ, బీఈడీ చదివాడు. వ్యవసాయమంటే ఎంతో మక్కువ. ఆయనకు వారసత్వంగా వచ్చిన రెండు ఎకరాల భూమి వచ్చింది. అందులో పంటలు సాగు చేయడం కోసం బోర్లు వేయించాడు. అలా పది బోర్లు వేయిస్తే అరకొర నీరు పడింది. ఆ నీటితోనే ఉన్న రెండు ఎకరాలకు తోడు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని ప్రస్తుతం మిరప, టమాట తదితర పంటలు సాగు చేశాడు. శుక్రవారం తోటకు వెళ్లిన తిప్పేస్వామి తనొక్కడే టమాట పంటకు పురుగుమందు పిచికారి చేశాడు. అనంతరం ఇంటికి వచ్చి అలసటగా ఉండటంతో కాసేపు నడుం వాల్చాడు. కొద్దిసేపటి తర్వాత కుటుంబ సభ్యులు వచ్చి లేపగా.. స్పందన లేకపోవడంతో వెంటనే కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అయితే అప్పటికే తిప్పేస్వామి మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. తిప్పేస్వామికి భార్య నాగలక్ష్మి, కూతుర్లు మైథిలి, ధన్విశ్రీ,, కుమారుడు సాయిస్వరూప్ ఉన్నారు. పెద్దదిక్కు ఆకస్మిక మృతి ఆ కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది. బోర్లు, పంట పెట్టుబడులు, కుటుంబ అవసరాల నిమిత్తం రూ.10లక్షల దాకా అప్పులు చేసినట్లు తెలిసింది. రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. మృతుని కుటుంబానికి గ్రామస్తులు ముత్యాలరెడ్డి, శ్రీనివాసరెడ్డి సోదరులు రూ.20వేల ఆర్థికసాయం అందించారు.

మార్కెట్‌యార్డులో ప్రశాంతంగా టెండర్లు



టెండర్ బాక్సు తెరుస్తున్న సిబ్బంది

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయ మార్కెట్‌యార్డులో 9 రకాల పనులకు జరిగిన టెండర్ల ప్రక్రియ శనివారం ప్రశాంతంగా ముగిసింది. ఆర్జేడీ సి.రామాంజినేయులు గైర్హాజరు కావడంతో ఆయన స్థానంలో ఏడీ– మార్కెటింగ్ బి.సత్యనారాయణచౌదరి, సెలెక్షన్ గ్రేడ్ సెక్రటరీ ఆర్.జయలక్ష్మి సమక్షంలో మధ్యాహ్నం 3 గంటల నుంచి టెండర్లు ఓపెన్ చేశారు. అత్యధిక కోట్ చేసిన వారికి టెండర్ ఖరారు చేశారు. టెండర్ దక్కించుకున్న వారి వివరాలను సెలెక్షన్ గ్రేడ్‌సెక్రటరీ ఆర్.జయలక్ష్మి వెల్లడించారు. పండ్లు, పశువుల మార్కెట్ క్లీనింగ్ టెండర్‌ను సి.వినోద్‌కుమార్ కైవసం చేసుకున్నారు. ఫిబ్రవరి నుంచి సెప్టెంబర్ వరకు ప్రతి నెలా రూ.79,500, అక్టోబర్ నుంచి జనవరి వరకు ప్రతి నెలా రూ.39,500 ప్రకారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. పండ్లమార్కెట్‌లో సంచార ఫలహార శాల టెండర్ రూ.1.85 లక్షలకు బి.రామక్రిష్ణ దక్కించుకున్నట్లు వివరించారు. మార్కెట్ కట్టుతాళ్ల దుకాణం నిర్వహణ టెండర్‌ను అత్యధికంగా రూ.18 లక్షలకు వై.మచ్చన్న దక్కించుకున్నాడు. ప్రతివారం పేడను ఊడ్చి బయటకు తరలించే టెండర్‌ను నెలకు రూ.25,600 ప్రకారం సి.వినోద్‌కుమార్ దక్కించుకున్నాడు. పశువుల మార్కెట్‌లో ఫలహారశాల టెండర్‌ను రూ.2.61 లక్షలకు పి.రమణయ్య దక్కించుకున్నాడు. పశువుల మార్కెట్‌లో టీ స్టాల్ ఏర్పాటుకు సంబంధించిన టెండర్‌ను రూ.3.75 లక్షలకు ఓంశంకర్ కైవసం చేసుకున్నాడు. 40 మెట్రిక్ టన్నుల వేబ్రిడ్జి టెండర్‌ను రూ.2,09,700 కోట్ చేసిన జి.రామాంజినేయులుకు వచ్చింది. చీనీ గ్రేడింగ్ మిషన్ నిర్వహణ టెండర్‌ను రూ.60,300కు ఎంవీ శ్రీనివాస్, సోడాలు, శీతల పానీయాల అమ్మకం టెండర్ రూ.1.06 లక్షలకు ఎం.రమణయ్య దక్కించుకున్నారు. త్వరలోనే ఆర్జేడీ అనుమతితో వర్క్ ఆర్డర్లు మంజూరు చేస్తామని తెలిపారు.

డయేరియాపై అప్రమత్తంగా ఉండాలి



కొనకొండ్లలో స్టాఫ్ డయేరియాపై అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌ఓ

ఉరవకొండ: మండలంలో డయేరియా కేసులు పెరుగుతున్న దృష్ట్యా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ ఇ.బి.దేవి సూచించారు. శనివారం ఉరవకొండ ప్రభుత్వ ఆస్పత్రిని ఆమె తనిఖీ చేశారు. అతిసార కేసుల వివరాలను వైద్యాధికారి డాక్టర్ గంగాధర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వార్డుల్లో చికిత్స పొందుతున్న వారి వద్దకు వెళ్లి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఈ నెల ఐదో తేదీన 16 అతిసారా కేసులు నమోదు కాగా, శనివారం ఒక్క రోజే 4 కేసులు నమోదయ్యాయన్నారు. డయేరియా కేసులు నమోదు కాకుండా గ్రామాల్లో విస్తృతంగా అవగాహన ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి, జాగ్రత్తలు, సూచనలు తెలియజేయాలన్నారు.

పరిశుభ్రత పాటించాలి

వజ్రకరూరు: వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని డీఎంహెచ్‌ఓ ఇ.బి.దేవి పిలుపునిచ్చారు. శనివారం కొనకొండ్లలో వజ్రకరూరు వైద్యాధికారి తేజశ్వి ఆధ్వర్యంలో జరుగుతున్న స్టాఫ్ డయేరియాపై జరుగుతున్న అవగాహన సదస్సును ఆమె పర్యవేక్షించారు. డీఎంహెచ్‌ఓ మాట్లడుతూ ప్రజలు భోజనానికి ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. వ్యక్తిగత మరుగుదొడ్లు వాడుకోవాలని, అతిసార బారిన పడకుండా ఓఆర్ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు తీసుకోవాలని అన్నారు. డయేరియాపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి చైతన్యవంతులను చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, సూపర్‌వైజర్లు సుశీల, నాగశంకర్ ,హెల్త్ అసిస్టెంట్ బాబావలి, ఏఎన్ఎం ఉషా మౌనిక, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, ఆశా కార్యకర్త లు, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్రకు భారీగా వరద



అనంతపురం సెంట్రల్/బొమ్మనహాళ్: కర్ణాటకలోని హొస్పేట వద్ద ఉన్న తుంగభద్ర జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. డ్యాం ఎగువన కురుస్తున్న వర్షాలతో వరద పోటెత్తుతోంది. ఈ ఏడాది అత్యధికంగా శనివారం మధ్యాహ్నం 57,347 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. సగటున 53,233 క్యూసెక్కులు వస్తున్నట్లు హెచ్చెల్సీ అధికారులు తెలిపారు. 14.663 టీఎంసీల నీరు ఉన్నట్లు వివరించారు. ఔట్‌ఫ్లో 355 క్యూసెక్కులు, కర్ణాటక ప్రాంతంలోని తాగునీటి అవసరాలకు 289 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

భార్యను హత్య చేసిన భర్త

- మద్యానికి డబ్బు ఇవ్వలేదని ఘాతుకం

బత్తలపల్లి: మద్యానికి డబ్బు ఇవ్వలేదన్న కోపంలో భార్యను హత్య చేసిన భర్త ఉదంతం తంబాపురంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తంబాపురం గ్రామానికి చెందిన హరిజన లక్ష్మమ్మ(62), లక్ష్మన్న దంపతులు. వీరికి ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. వీరిలో కుమారుడు ముత్యాలప్ప, చిన్నకుమార్తె క్రిష్ణమ్మ జగనన్న లేఅవుట్‌లో ఉన్నారు. లక్ష్మమ్మ దంపతులు మాత్రం ఎస్సీ కాలనీలోని పాత ఇంట్లోనే ఉంటున్నారు. లక్ష్మమ్మ అనారోగ్యంతో మంచానికి పరిమితమైపోయింది. లక్ష్మన్న కూలి పనులు చేసుకుంటూ, దండోరా వేస్తుంటాడు. మద్యానికి బానిసైన ఇతడు ఇంట్లో డబ్బు తీసుకుని తాగేందుకు ఖర్చు చేస్తుంటాడు. లక్ష్మమ్మకు ఈ నెలలో వృద్ధాప్య పింఛన్ కింద బకాయిలతో కలిపి రూ.7 వేలు పంపిణీ చేశారు. ఆ మొత్తాన్ని ఆమె భద్రంగా దాచుకుంది. లక్ష్మన్న మద్యం కోసం డబ్బు ఇవ్వాలని భార్యను ఒత్తిడి చేశాడు. ఆమె ఇవ్వకపోవడంతో కోపోద్రిక్తుడై రోకలిబండతో ఆమె తలపై కొట్టి చంపేశాడు. ఆమె చనిపోయిందని నిర్ధారించుకున్నాక అక్కడి నుంచి పారిపోయాడు. సమాచారం అందుకున్న ఎస్‌ఐ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అర్ధరాత్రి దొంగల హల్‌చల్

చెన్నేకొత్తపల్లి(కనగానపల్లి): కుటుంబ సభ్యులు ఆరుబయట నిద్రించే ఇళ్లను టార్గెట్ చేసుకున్న దొంగలు అర్ధరాత్రి వేళ హల్‌చల్ చేశారు. రెండు ఇళ్లల్లోకి చొరబడి పది తులాల బంగారు ఆభరణాలతో ఉడాయించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కనగానపల్లి మండలం మామిళ్లపల్లికి చెందిన జయరామిరెడ్డి తన భార్య సావిత్రితో కలసి శుక్రవారం రాత్రి ఇంటి ముందు మంచంపై దోమతెర కట్టుకొని నిద్రించారు. అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు కత్తితో దోమతెరను కత్తిరించి నిద్రిస్తున్న సావిత్రి మెడలో ఉన్న 3 తులాల బంగారు తాళిబొట్టు గొలుసును లాక్కున్నారు. హఠాత్పరిణామంతో ఉలిక్కిపడి లేచిన సావిత్రి గట్టిగా కేకలు వేయడంతో దొంగలు అక్కడి నుంచి పారిపోయారు. అలాగే ముక్తాపురంలోకి ప్రవేశించిన దొంగలు.. కుటుంబ సభ్యులతో ఆరుబయట నిద్రిస్తున్న వెంకటనారాయణరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి తలుపులు పగలగొట్టి లోపలికెళ్లారు. అల్మారాలో చీరల కింద డబ్బాలో ఉన్న 7 తులాల బంగారుతో పాటు, అక్కడే ఉన్న మొబైల్ ఎత్తుకెళ్లారు. శనివారం తెల్లవారుజామున నిద్ర లేచిన వెంకటనారాయణరెడ్డి తలుపులు తెరిచి ఉండటం గమనించి లోపలికి వెళ్లి చూడగా అల్మారాలోని చీరలు చిందరవందరగా పడి ఉండటం గమనించాడు. డబ్బాలో భద్రపరచిన బంగారాన్ని చూడగా కనిపించ పోవడంతో దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు.

క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న సీహెచ్ఓ శివ ప్రసాద్

రాప్తాడు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సీహెచ్ఓ శివప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్ అరుణమ్మ సూచించారు. పరిసరాలు, చేతుల శుభ్రతపై మండలంలోని ధర్మవరం పంగల్ రోడ్డు సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్లో శనివారం విద్యార్థులకు అవగాహన కల్పించారు. భోజనానికి ముందు సబ్బుతో చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు పలుచటి ద్రవ విరేచనాలు అయితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రిన్సిపల్ పద్మజా దేవి, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మీ, ఏఎన్ఎం అనిత, ఆశా అరుణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిని దూషించిన డీలర్‌ను శిక్షించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం కోరుమానిపల్లి ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడి విధులకు ఆటంకం కల్గించి భయభ్రాంతులకు గురిచేసిన స్టోర్ డీలర్‌పై కేసు నమోదు చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంఈఓ అనుమతి లేకుండా రేషన్ బియ్యాన్ని పాఠశాల గదుల్లో పెట్టొద్దన్న ఉపాధ్యాయుడిపై డీలర్ దుర్భాషలాడడం సరికాదన్నారు. టీచర్ కన్నీళ్లు పెట్టుకున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోందన్నారు. ఘటన జరిగి ఆరు రోజులవుతున్నా బాధిత ఉపాధ్యాయుడికి రక్షణ ఇవ్వకుండా అధికారులు చోద్యం చూస్తున్నారన్నారు. సదరు రేషన్ డీలర్‌ను కఠినంగా శిక్షించాలని కోరారు.

నిత్యావసరాల అందజేత



అభాగ్యురాలికి నిత్యావసరాలు అందిస్తున్న నిత్యసురభిట్రస్టు నిర్వాహకులు

అనంతపురం కల్చరల్: రామచంద్రానగర్‌లో నివసిస్తున్న నిరుపేద కుటుంబానికి, ఒక ఒంటరి మహిళకు మూడు నెలల సరిపడా నిత్యావసర వస్తువులు, కొంత నగదును పుట్టినిల్లు ఆశ్రమం ఆధ్వర్యంలో శనివారం అందించారు. నిత్యసురభి చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ నిర్మలా మురళీ మాట్లాడుతూ మహిళలు చిన్నా, చితకా పనులు చేసుకుంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారని, అటువంటి వారికి ప్రతివారం బియ్యం, 33 రకాల నిత్యావసరాల కిట్టును అందిస్తున్నామన్నారు. నవ్యశ్రీ, లక్ష్మీనారాయణ, పల్లవి పాల్గొన్నారు.

నేడు గ్యాస్ సిలిండర్ల పంపిణీ

రాప్తాడు: రాప్తాడు, అనంతపురం రూరల్ మండలాల్లో భారత్ గ్యాస్ వినియోగదారులకు ఆదివారం గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయనున్నారు. ఈ నెల 6 వరకు ఇండేన్ గ్యాస్ బుక్ చేసుకున్న గంగలకుంట, ధర్మవరం పంగల్‌రోడ్డు, అనంత టౌన్ షిప్, శిల్పా లేపాక్షి నగర్, ఉప్పరపల్లి, పూలకుంట, చియ్యేడు, కృష్ణమరెడ్డిపల్లి, ముష్టూరు, రాఘవంపల్లి, ఎస్కేయూ, ఇటుకలపల్లి, ఎస్వీ పురం, ఆకుతోటపల్లి, కందుకూరు, జంగాలపల్లి తదితర గ్రామాల్లోని వినియోగదారులకు రాప్తాడులోని పాత ఎంపీడీవో కార్యాలయం ఎదుట వంట గ్యాస్ సిలిండర్లను అందజేయనున్నారు.

అంగన్‌వాడీ యూనియన్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

అనంతపురం సెంట్రల్: అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. శనివారం అర్బన్ సీడీపీఓ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అధ్యక్షురాలిగా నక్షత్ర, కార్యదర్శిగా రేవతి, కోశాధికారిగా షాహినా, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతపురం అర్బన్ ప్రాజెక్టులో అనేక ఆరోపణలు రావడంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోవాల్సి వచ్చిందని నాయకులు తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, నగర అధ్యక్షుడు వెంకటనారాయణ పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

పుట్లూరు: మండలంలోని గరుగుచింతలపల్లిలో శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీ, టీడీపీ వర్గీయుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పెద్ద నాగలింగ, రవీంద్రకు తీవ్ర గాయాలు కాగా టీడీపీ చెందిన నవీన్‌కు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. గాయపడిన వారిని తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అటకెక్కిన ప్లాస్టిక్ నిషేధం

- యథేచ్ఛగా విక్రయాలు, వినియోగం
- ప్లాస్టిక్ విక్రయాల హోల్‌సేల్ షాపుల వైపు కన్నెత్తి చూడని అధికారులు



అనంతపురం కార్పొరేషన్: పర్యావరణానికి తూట్లు పొడిచి భూ వాతావరణాన్ని వేడెక్కించే ప్లాస్టిక్ భూతాన్ని కట్టడి చేయడంలో నగర పాలక సంస్థ అధికారులు అశ్రద్ధ చేస్తున్నారు. కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాలతో నగరంలో పెద్ద ఎత్తున ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు గత నెలలో నగరపాలక సంస్థ అధికారులు, కమిషనర్ పేర్కొన్నారు. కొన్ని రోజుల పాటు ఆటోల ద్వారా ప్రచారం నిర్వహించారు. అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, ఏసీపీ మారుతి ప్రసాద్, ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి ఆధ్వర్యంలో మూడు బృందాలు నగరంలో పర్యటించాయి. కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు, ప్లాస్టిక్ షాపులపై స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. అయితే ఆ ప్రక్రియ కొనసాగలేదు. వారం రోజుల కూడా కాకుండానే ప్లాస్టిక్ నియంత్రణను అటకెక్కించారు. ఇప్పటివరకు 200 కేజీల ప్లాస్టిక్‌ను మాత్రమే సీజ్ చేశారు. షాపులపై రూ.1.8లక్షల మేర జరిమానా విధించారు. అందులో రూ.లక్ష మాత్రమే వసూలైంది. నగరంలో ప్లాస్టిక్ విక్రయించే షాపులు 16 వరకు ఉన్నాయి. ఆ షాపుల ద్వారా రూ.కోట్లలో వ్యాపారం జరుగుతోంది. పాతూరు ప్రాంతంలో అత్యధికంగా ప్లాసిక్ విక్రయించే షాపులు న్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ఇక్కడి నుంచి నిషేధిత, ప్రమాదకర ప్లాస్టిక్‌ను విక్రయాలు జరుగుతున్నాయి. కోట్లలో వ్యాపారం జరుగుతోంది. అయినా అధికారులు ఆ వైపు తొంగి చూడటం లేదు.

చర్యలు తీసుకుంటున్నాం

నగరంలో ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే కొన్ని షాపులపై దాడులు చేపట్టి 200 కేజీల ప్లాస్టిక్ సీజ్ చేశాం. శనివారం పాతూరులో డ్రైవ్ చేపట్టి వ్యాపారులపై జరిమానా విధించాం. ప్రజల్లోనూ సామాజిక స్పృహతో ప్లాస్టిక్‌ను వాడకుండా ఉండాలి.

– డాక్టర్ విష్ణుమూర్తి, ఎంహెచ్ఓ, నగరపాలక సంస్థ

టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు

రోజూ కంపోస్టు యార్డుకు టన్నుల కొద్దీ ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తున్నాయి. నడిమివంక, మరువవంకలోనూ ప్లాస్టిక్ పెద్ద ఎత్తున వస్తోంది. ప్లాస్టిక్ విక్రయాలు చేపడుతున్న షాపులపై దాడులు నిర్వహిస్తే సగం ప్లాస్టిక్‌ను నియంత్రించవచ్చనే అభిప్రాయాలు నగరవాసులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా కమిషనర్ మేఘ స్వరూప్ ఆ దిశగా చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాల్సిందే.

జాగ్రత్తలు పాటిస్తే జూనోసిస్ వ్యాధులు దూరం



పెంపుడు శునకాలకు రేబీస్ టీకా వేస్తున్న దృశ్యం



అనంతపురం అగ్రికల్చర్: స్థానిక సాయినగర్‌లో ఉన్న పశువుల ఆస్పత్రి ప్రాంగణం శనివారం వివిధ రకాల పెంపుడు కుక్కలతో కిటకిటలాడింది. ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రిలో ఏడీ డాక్టర్ సురేష్ ఆధ్వర్యంలో పశువైద్యులు కుక్కలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా రేబీస్ టీకాలు వేశారు. చాలా మంది పెంపుడు కుక్కలను తీసుకొచ్చి టీకా వేయించారు. ఏడీ మాట్లాడుతూ జంతువులు, పశుపక్ష్యాదుల నుంచి సంక్రమించే 'జూనోటిక్' వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. కుక్కల ద్వారా ప్రమాదకరమైన రేబీస్‌తో పాటు బ్రూసెల్లోసిస్, అంత్రాక్స్ (దొమ్మవ్యాధి), స్వైన్‌ఫ్లూ, బర్డ్‌ఫ్లూ, జపనీస్ ఎన్‌సెఫలైటిస్, సిస్టిసర్కోసిస్ తదితర ప్రాణాంతక వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కుక్క కాటు వల్ల ఏటా బాధితుల సంఖ్య ఎక్కువగా నమోదవుతుందోన్నారు. క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని సూచించారు. పరిసరాల శుభ్రత, బాగా ఉడికించిన మాంసం, గ్రుడ్లు తీసుకోవడం, బాగా కాచిన పాలు తాగడం లాంటి మరికొన్ని జాగ్రత్తలు తీసుకుంటే జూనోటిక్ వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా జూనోసిస్‌డేను నిర్వహించి పెద్ద ఎత్తున రేబీస్ టీకాలు పూర్తి చేసినట్లు జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం తెలిపారు.



పెంపుడు శునకంతో వచ్చిన మహిళ



బైక్‌పై దర్జాగా వచ్చిన శునకం



పెంపుడు శునకంతో యువతి

సామాజిక సమానత్వం జగ్జీవన్‌రామ్ ఆశయం



బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: సామాజిక సమానత్వం కోసం దివంగత మాజీ ఉప ప్రధాని జగ్జీవన్‌రామ్ ఎంతో కృషి చేశారని, ఆయన్ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఉమ్మడి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం జిల్లా పరిషత్ కార్యాలయంలోని తన చాంబర్‌లో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఒకవైపు దేశ స్వాతంత్ర్యం కోసం, మరోవైపు సామాజిక సమానత్వం కోసం అలుపెరగని సమరం సాగించారన్నారు. బడుగు, బలహీన వర్గాలు విద్యావంతులుగా, ఆత్మాభిమానం కలవారిగా చేయాలన్నదే ఆయన ఆశయమన్నారు. ప్రజల హక్కుల గురించి అంబేడ్కర్ రాజ్యాంగంలో పొందుపరిస్తే, వాటిని చట్టరూపంలో సమర్థవంతంగా అమలయ్యేలా జగ్జీవన్‌రామ్ కృషి చేశారన్నారు. ఎన్నో రాజకీయ పదవులు అలంకరించి దేశానికి విశేష సేవలు అందించారన్నారు. దళితులందరూ విద్యను ఆయుధంగా మలచుకొని ఆర్థిక స్వావలంబన సాధించడం, ఆత్మగౌరవంగా బతకడానికి కృషి చేయడమే మనం ఆయనకు అర్పించే నిజమైన నివాళి అవుతుందని డిప్యూటీ సీఈఓ లలితాబాయి అన్నారు. పారిపాలనాధికారులు, జెడ్పీ ఉద్యోగులు పాల్గొన్నారు.

అనంతపురం టవర్‌క్లాక్: దివంగత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ దేశానికి అందించిన సేవలు మరువలేనివని ఎస్సీ,ఎస్టీ సంఘాల జేఏసీ అధ్యక్షుడు సాకే హరి అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతిని పురస్కరించుకొని సప్తగిరి సర్కిల్‌లో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బడుగు వర్గాల అభ్యున్నతికి, రైతాంగ సంక్షేమానికి జగ్జీవన్ రామ్ కృషి చేశారన్నారు. రామాంజినేయులు, సుంకన్న, వన్నూరప్ప, నాగరాజు, ఓబులేసు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వారాహి నవరాత్రుల ఉత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: జ్ఞానమార్గం చూపే ఆషాఢ మాసం శనివారం ఘనంగా ప్రారంభమైంది. పలు చోట్ల అమ్మవారు విశేష పూజలందుకున్నారు. నగర శివార్లలోని జగద్గురు శంకర శ్రీదత్తాత్రేయ మహాసంస్థానం విరూపాక్ష మఠంలో పీఠాధిపతులు విద్యానరసింహభారతీ స్వామీజీ భక్తులతో అమ్మవారికి శ్రీచక్రార్చన, ఆవరణ పూజలు చేయించారు. రుత్వికులు గణపతిపూజ, దేవనంది, స్వస్తిపుణ్యావాచనం, వారాహి కలశస్థాపనలను శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా స్వామీజీ అనుగ్రహభాషణం చేస్తూ ఈ మాసంలో నవరాత్రుల పేరిట సాగే హోమాలు, మంత్రోష్టానాలు మనిషికి ఆరోగ్యాన్ని, మానసిక ప్రశాంతతనిస్తాయని తెలిపారు. ఈనెల 14 వరకు నిత్య పూజలు జరుగుతాయన్నారు. అనంతరం తీర్థప్రసాద వినియోగం, అన్నప్రసాద వితరణ జరిగాయి. మునిపల్లి భరత్ శర్మ, యశ్వంత్‌శర్మ, సుబ్రమణ్యం, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతాలు



వ్రతం జరిపిస్తున్న దృశ్యం



వ్రతంలో పాల్గొన్న భక్తులు

అనంతపురం కల్చరల్: శ్రీవేంకటేశ్వరుడికి ప్రీతిపాత్రమైన ఏడు శనివారాల వ్రతాలు స్థానిక శారదా నగర్‌లోని శ్రీ శృంగేరి శంకర మఠంలో ఘనంగా జరిగాయి. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుడిని సర్వాంగ సుందరంగా అలంకరించి వ్రత కథలను అర్చకులు భక్తిశ్రద్ధలతో జరిపించారు. అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు స్వామివారిని ఆరాధించుకున్నారు. మధ్యాహ్నం మహామంగళ హారతి అనంతరం ప్రసాద వితరణ జరిగింది. మఠం నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 13, 20, 27 తేదీలు, వచ్చేనెల 3,10, 17, 24, 31 తేదీలలో ఏడు శనివారాల వ్రతాలు ఘనంగా సాగుతాయన్నారు. తొలిరోజు జరిగిన వ్రతంలో పాల్గొనలేని వారు రానున్న శనివారాలలో వ్రతాన్ని చేసుకోవచ్చన్నారు.

నగరంలోని వివిధ శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఏడు శనివారాల వ్రతాలు ఘనంగా ప్రారంభమయ్యాయి.

వైద్య సేవల్లో అగ్రగామిగా నిలవాలి



ఉత్తమ వైద్యులను సన్మానించిన వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు

అనంతపురం మెడికల్: జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించి రాష్ట్రంలోనే ఉత్తమ బోధనాస్పత్రిగా పేరు తీసుకురావాలని అనంతపురం వైద్య కళాశాల ప్రిన్సిపాల్, డీన్ డాక్టర్ మాణిక్య రావు వైద్యులకు పిలుపునిచ్చారు. డాక్టర్స్ డే వారోత్సవాల్లో భాగంగా శనివారం ప్రభుత్వ వైద్య కళాశాలలో ఉత్తమ వైద్యులను ఆయన సన్మానించి మాట్లాడారు. సర్వజనాస్పత్రిలో గైనిక్, సర్జరీ, చిన్నపిల్లల విభాగం, ఆప్తమాలజీ తదితర విభాగాల్లో రోగులకు ఉత్తమ సేవలు అందుతున్నాయన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో ఖరీదైన వైద్యం అందుతోందన్నారు. కార్డియాలజీ, న్యూరో విభాగాల్లో క్లిష్టమైన సర్జరీలను వైద్యులు విజయవంతం చేస్తున్నారన్నారు. వైద్యులు ఇదేస్ఫూర్తిని కొనసాగించాలన్నారు. వైస్ ప్రిన్సిపాళ్లు డాక్టర్ షంషాద్‌బేగం, డాక్టర్ నవీన్‌కుమార్, డాక్టర్ షారోన్, న్యూరో సర్జన్ డాక్టర్ భాస్కర్, వైద్యులు డాక్టర్ రేణుక, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ సంజీవప్ప, తదితరులు పాల్గొన్నారు.

సహకార రంగం అన్నదాతలకు వెన్నుదన్ను



సహకార ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం స్థానిక జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ), అలాగే రామ్‌నగర్‌లో ఉన్న రాయలసీమ సహకార శిక్షణా కేంద్రంలో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సహకార పతాకావిష్కరణ చేసి ప్రతిజ్ఞ చేశారు. స్వాతంత్ర్య సంగ్రామంలో కీలకపాత్ర పోషించిన సహకార వ్యవస్థను మరింత పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సహకార రంగం ద్వారా రైతులతో పాటు అన్ని వర్గాలకు విశిష్ట సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా సహకార అధికారి ఈ.అరుణకుమారి, డీసీసీబీ సీఈవో కె.సురేఖారాణి, డీఆర్‌వో సూర్యనారాయణ, డీజీఎం ఏబీ రామ్‌ప్రసాద్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ ఎంబీ మురళీమోహన్, డిప్యూటీ రిజిస్ట్రార్ రాజారెడ్డి, శిక్షణా కేంద్రం ప్రిన్సిపల్ బి.శ్రీనివాసులు, ఫ్యాకల్టీలు పాల్గొన్నారు.

సిమెంట్ లారీ బోల్తా



గుత్తి: పట్టణ శివారులోని గుంతకల్లు రోడ్డులో చెరువు కట్ట వద్ద శుక్రవారం రాత్రి సిమెంట్ లారీ అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి పొలాల్లోకి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్ బాలకృష్ణ గాయపడ్డాడు. వివరాలు.. తాడిపత్రి నుంచి బళ్లారికి సిమెంట్ లోడుతో వెళుతున్న లారీ మార్గ మధ్యంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. లారీ దెబ్బతినింది. సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

శాస్త్రీయ విజ్ఞానాన్ని ఆచరించినప్పుడే దేశాభివృద్ధి



సభ్యత్వం చేపడుతున్న జేవీవీ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: సైన్స్, శాస్త్ర విజ్ఞానంపై అవగాహన పెంచుకొని ఆచరణలో పెట్టినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని జేవీవీ రాష్ట్ర నాయకులు కె.శ్రీనివాస్ అన్నారు. జనవిజ్ఞాన వేదిక నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఆకుతోటపల్లి సమీపంలోని రాధా స్కూల్ ఆఫ్ లర్నింగ్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. కె.శ్రీనివాస్ మాట్లాడుతూ మన తర్వాత స్వాతంత్ర్యం వచ్చిన దేశాలు అభివృద్ధి చెందిన దేశాలుగా పిలవబడుతున్నాయని, మన దేశం మాత్రం అలాగే ఉందన్నారు. పలు దేశాలు ప్రజల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందిస్తుండగా మనదేశంలో కేవలం చదవడానికి మాత్రమే ఉపయోగిస్తున్నామన్నారు. హైస్కూలు స్థాయి నుంచే విద్యార్థులకు శాస్త్రీయ విజ్ఞానం పట్ల అవగాహన కల్పించి ఆచరించేలా చూడాలని తెలిపారు. రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ సాకే భాస్కర్, నగర అధ్యక్ష, కార్యదర్శులు రామిరెడ్డి, వీరరాజు, నాయకులు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పండమేటి రాయుడికి ప్రత్యేక పూజలు

రాప్తాడు: మండల కేంద్రంలోని పండమేరు వంక సమీపంలో ఉన్న పండమేటి రాయుడు ఆలయంలో శనివారం పూజారి మారుతీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అదేవిధంగా మరూరు గ్రామంలో వెలసిన చిన్నకదిరయ్య స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.గాండ్లపర్తి గ్రామంలో కొలువైన తిరుమల దేవరకొండ రాయుడు దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలను గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

నేడు విశేష పూజలు

హంపాపురం గ్రామ సమీపంలో మౌనగిరిక్షేత్రంలో కొలువైన 39 అడుగుల అభయాంజనేయస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు ఈశ్వరయ్యస్వామి తెలిపారు. అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తామన్నారు.

రేపు కురుగుంటలో ఖాదర్‌వలీ సదస్సు

అనంతపురం అగ్రికల్చర్: చిరుధాన్యాల అంశంపై రేపు (సోమవారం) రూరల్ మండలం కురుగుంటలో ఉన్న పుడమి మిల్లెట్ హోటల్, ఆర్గానిక్ ఫాంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్‌వలీ సదస్సు ఉంటుందని విశ్రాంత ప్రొఫెసర్ గంగిరెడ్డి శనివారం తెలిపారు. 'ఎ డయబెటిక్ ఫ్రీ విలేజ్' అనే అంశంపై మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు కురుగుంట ఉమెన్ కలెక్టివ్ ఫాంలో జరిగే కార్యక్రమానికి ఆసక్తి కలిగిన వారు హాజరు కావాలని కోరారు.

నేడు 'నిత్యనవనీతం' పుస్తకావిష్కరణ

అనంతపురం కల్చరల్: సీనియర్ కవి నబీరసూల్ రాసిన 'నిత్యనవనీతం నబిరసూల్ సుభాషితం' పుస్తకావిష్కరణ జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఉపాధ్యాయభవన్‌లో జరుగుతుందని జిరసం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి సురేష్ శనివారం తెలిపారు. కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, ఆచార్య బాలసుబ్రమణ్యం, ప్రముఖ నాట్యాచార్యులు సంధ్యామూర్తి హాజరవుతారన్నారు.

సీ అండ్ డీ ప్లాంట్ ఎంతో ఉపయోగకరం



భవన నిర్మాణ వ్యర్థాల రీ సైక్లింగ్‌ను పరిశీలిస్తున్న మేయర్ వసీం తదితరులు

అనంతపురం కార్పొరేషన్: కంపోస్టు యార్డులో నగరపాలక సంస్థ నూతనంగా ఏర్పాటు చేసిన సీ అండ్ డీ ప్లాంట్(కన్‌స్ట్రక్షన్, డెమాలిషన్) నిర్వహణను మేయర్ వసీం శనివారం పరిశీలించారు. ఎన్ క్యాప్ నిధులు రూ.30 లక్షలతో ఈ ప్లాంట్ ఏర్పాటు చేశామని, ఈ ప్లాంట్ ద్వారా నగరంలోని భవన నిర్మాణ వ్యర్థాలను రీ సైక్లింగ్ చేసి ఇసుక, కంకరను వేరు చేసి ఫుట్‌పాత్, పేవర్ బ్లాక్‌లు, ప్యాచ్ వర్క్‌లకు వినియోగించవచ్చన్నారు. రోజుకు ఐదు టన్నుల వ్యర్థాలను మళ్లీ వినియోగంలోకి తీసుకురావచ్చన్నారు. ఈప్లాంట్‌పై నగర వాసులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కంపోస్టు యార్డును పరిశీలించారు. సీసీ కెమెరాల నిర్వహణపై ఆరా తీశారు. అనుమానితులు కన్పించినా..యార్డులో మంటలు చెలరేగినా ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సిబ్బందిని ఆదేశించారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, ఈఈ సూర్యనారాయణ, కార్పొరేటర్లు అబూసలేహా, కమల్‌భూషణ్, నాయకులు రామచంద్ర, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.